క్లుప్తంగా

మహిళలకు వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న డాక్టర్ కీర్తిప్రియ

తడ: స్థానిక ఎస్ఎస్ హెల్త్ కేర్ ఆస్పత్రి 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం తడలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ కీర్తి ప్రియ మహిళలను పరీక్షించారు. వారిలో సంభవించే అధిక రక్త స్రావం ఇతర సమస్యలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. గర్భిణులకు పరీక్షలు చేసి పోషకాహార సమస్యలు ఉన్న వారు తీసుకోవాలసిన జాగ్రత్తలను వివరించారు.

యాకసిరి తిప్పపై విశేష పూజలు



అర్ధనారీశ్వర అలంకరణలో భూపతీశ్వరుడు

చిట్టమూరు : మండలంలోని యాకసిరి తిప్పపై కొలువైన గౌరీ సమేత భూపతీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు చేశారు. నాయుడుపేట, చిట్టమూరు, సూళ్లూరుపేట ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలోని శివలింగాలకు అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

రూ.10 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం



బీసీ కాలనీలో వేస్తున్న సీసీరోడ్డు

ఓజిలి: మండలంలోని వెంకటరెడ్డిపాళెం బీసీ కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. సర్పంచ్ కదిరి లలితమ్మ, వైఎస్సార్ సీపీ యువత అధ్యక్షుడు బట్టా పృథ్వీకుమార్ యాదవ్, అనీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ వెంకటరెడ్డిపాళెం బీసీ కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలని జెడ్పీటీసీ రవీంద్రరాజును కోరామన్నారు. స్పందించిన ఆయన జెడ్పీ చైర్మన్‌తో మాట్లాడి రూ.10 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. కాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

నిలిపి ఉన్న బస్సును ఢీకొన్న బైక్

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని ఎస్ఎస్ఆర్ కాలనీ సమీపంలో ఆదివారం సాయంత్రం రోడ్డు పక్కన నిలిపి ఉన్న ప్రైవేట్ బస్సును బైక్ ఢీకొంది. దీంతో బైక్‌లో వస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని శ్రీరామ్ నగర్‌కు చెందిన నరేష్, అతని స్నేహితుడు చిట్టమూరుకు చెందిన నరేష్‌రెడ్డి బైక్‌లో నాయుడుపేట బస్టాండు నుంచి సీఎస్‌తేజ సెంటర్‌కు వస్తున్నారు. ఎస్ఎస్ఆర్ కాలనీ వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న బస్సును ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి నెల్లూరు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంపాళెంలో పందుల స్వైర విహారం



వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని కాంపాళెంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా ఇళ్ల ముందు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. మురుగు కాలువలు, చెత్తాచెదారంలో పొర్లుతుండడంతో దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతున్నాయని చెబుతున్నారు. పందుల బెడదను నివారించాలని పలుమార్లు మున్సిపాలిటీ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రోడ్డు తవ్వారు.. వదిలేశారు

"మేమొస్తే గ్రామీణ ప్రాంతాల రోడ్లను తారు రోడ్లుగా మారుస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం" అని కూటమి నేతలు ఎన్నికల్లో గొప్పలు చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా రోడ్ల గురించి పట్టించుకోవడం లేదు. పైగా అంతో ఇంతో బాగున్న రోడ్లను తవ్వేశారు. నిధులు రాలేదని సాకులు చూపి మరమ్మతులు చేయకుండా వదిలేశారు. గుంతలమయమైన రోడ్డుపై ప్రయాణించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు.

- అధ్వానంగా సూళ్లూరుపేట– కోట రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

చిట్టమూరు : మండలంలోని సూళ్లూరుపేట–కోట రోడ్డు 5 మండలాలను కలుపుతుంది. ఈ క్రమంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రద్దీగా ఉంటుంది. ఈ సుమారు 25 గ్రామాల ప్రజలు కోటతోపాటు సూళ్లూరుపేట తదితర ప్రాంతాలకు వెళుతుంటారు. ఆర్టీసీ, తడ సెజ్‌లోని శ్రీసిటీ కంపెనీ బస్సులతోపాటు పెద్ద పెద్ద వాహనాలు తిరుగుతూ ఉంటాయి. సుమారు 30 బస్సులు ప్రతి రోజూ ఆయా కంపెనీల ఉద్యోగులను తరలిస్తుంటాయి. రద్దీ పెరగడంతో రోడ్డు గుంతలమయమైంది. పలు మార్లు ఆర్టీసీ, ప్రయివేటు బస్సులు ప్రమాదాల బారిన పడ్డాయి. ఈ క్రమంలో కూటమి నేతలు రోడ్డును బాగు చేయాలని రూ.80 లక్షలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పింపించారు. నిధులు మంజూరవుతాయని భావించి తూతూమంత్రంగా పనులు చేసి ప్రజా ధనాన్ని స్వాహా చేయాలని భావించారు. అంతోఇంతో బాగున్న రోడ్డును జేసీబీతో తవ్వేశారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో గుంతలను పూడ్చకుండా వదిలేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవుని యజమానులు లబోదిబో మంటున్నారు. అలాగే ప్రయివేట్ కంపెనీలకు వెళ్లే బస్సులు సకాలంలో ఉద్యోగులను తరలించలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో తాము సమయానికి విధులకు హాజరుకాలేకపోతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి సూళ్లూరుపేట–కోట రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రెండు నెలల క్రితం రోడ్డు పక్కకు ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు

కోట నుంచి సూళ్లూరుపేటకు వెళ్లాలంటే అల్లాడిపోతున్నాం



రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ గుంతలు పడ్డాయి. దీంతో కోట–నుంచి సూళ్లూరుపేటకు వెళ్లాలంటే అల్లాడిపోతున్నాం. కంపెనీలకు సమయానికి వెళ్లలేక ఆలస్యమవుతోంది. దీంతో జీతంలో కోత పడుతోంది. కూటమి ప్రభుత్వం గుంతలు లేని రోడ్లు చేస్తామని ప్రగల్భాలు పలికి మరమ్మతులు కూడా చేయడం లేదు.

– కస్తూరయ్య, ములకలపూడి

బైక్‌లు మరమ్మతులకు గురవుతున్నాయి



సూళ్లూరుపేట–కోట రోడ్డు మొత్తం గుంతలుమయమైంది. అక్కడక్కడా బాగున్న రోడ్డును కూటమి నేతలు మరమ్మతుల పేరుతో తవ్వేశారు. దీంతో ద్విచక్ర వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై గుంతలను పూడ్చాలి.

– సునీల్, చిట్టమూరు

నివేదికలు పంపించాము

కోట–సూళ్లూరుపేట రహదారికి మరమ్మతులు చేయడానికి ప్రభుత్వానికి రూ.80 లక్షలతో ప్రతిపాదనలు పంపించాము. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాము.

– చిన్న రాయుడు, ఆర్అండ్‌బీ ఏఈ

కండలేరులో 50.940 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 50.940 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయ కుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 780, లోలెవల్ కాలువకు 110, హైలె వల్ కాలువకు 160, మొదటి బ్రాంచ్ కాలువకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతకు నివాళి



పాలూరు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కిలివేటి, నాయకులు

పెళ్లకూరు: మండలంలోని పాలచ్చూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పాలూరు మురళీరెడ్డి(68) శనివారం రాత్రి మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మురళీరెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. నాయకులు పాలూరు దశరథరామిరెడ్డి, కట్టా కమలాకర్‌రెడ్డి, కలికి మాధవ రెడ్డి, పాదర్తి హరినాథ్‌రెడ్డి, ఒట్టూరు కిశోర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

18న లక్ష్మీ నృసింహునికి చందనాలంకరణ

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి మూలమూర్తికి 18న చందనాలంకరణ చేపట్టనున్నట్టు అర్చకులు తెలిపారు. స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా ఉదయం 4 గంటలకు తిరుప్పావై, 9 గంటలకు శాంతి హోమం, 10 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు బంగారు గరుడ సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం



నాయుడుపేట టౌన్ : యువత పోరు పోస్టర్ ఆవిష్కరణలో సంజీవయ్య



చిల్లకూరు : ఎమ్మెల్సీని సత్కరిస్తున్న నిఖిల్ సాయి తదితరులు

- 12న యువత పోరు
- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం వారి జీవితాలతో చలగాటం ఆడుతోందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆరోపించారు. ఈ నెల 12న చేపట్టనున్న యువత పోరు కార్యక్రమ పోస్టర్లను ఆదివారం నెల్లూరు జిల్లా పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఇందులో ఆయన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఇతర నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ యువత ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సూళ్లూరుపేట నియోజవర్గం నుంచి నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. టీడీపీ కూటమి ప్రభుత్వం మహిళలు, రైతులతోపాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. ముఖ్యంగా విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన మంజూరు చేయడం లేదన్నారు.

యువత పోరును విజయవంతం చేయండి

చిల్లకూరు: ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కూటమి ప్రభుత్వం చర్యలకు నిరసనగా ఈ నెల 12న కలెక్టరేట్ల వద్ద చేపనున్న యువత పోరును విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పిలుపునిచ్చారు. ఆయనను ఆదివారం గూడూరు పట్టణంలోని సనత్ నగర్‌లో ఉన్న స్వగృహంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు భీమన నిఖిల్‌సాయి, నాయకులు కలిశారు. శాలువా కప్పి సత్కరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి బుట్టదాఖలు చేసిందన్నారు. ఈ విషయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులు ఆగకుండా చూడాలన్నారు. ఈ క్రమంలోనే విద్యార్థులకు అండగా నిలుస్తూ ఈ నెల 12న అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద యువత పోరు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గూడూరు నియోజకవర్గం నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, రఘురామిరెడ్డి, హరి, అఖిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్‌లో 13 బైక్‌లు స్వాధీనం

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని అరుంధతీయవాడలో ఆదివారం తెల్లవారు జామున సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ చేపట్టారు. 130 ఇళ్లలో తనిఖీలు చేపట్టి ఎలాంటి పత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం, రవాణా నేరమన్నారు. నేర ప్రవృత్తితో జీవితాలను నాశనం చేసుకోవద్దని, సమాజంలో శాంతియుతంగా జీవించాలని సూచించారు. చట్టాలను ఎవరైనా అతిక్రమిస్తే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతయ్య, వెంకయ్య, టూటౌన్ ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న పోలీసులు

మేరిగను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను సత్కరిస్తున్న సుధీర్ రెడ్డి, లోకేష్ రెడ్డి



ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను కలిసిన జెడ్పీటీసీ కోటయ్య

చిట్టమూరు/కోట/వాకాడు : గూడూరు నియోజకవర్గానికి చెందిన యూత్ వింగ్ అధ్యక్షుడు మాచిరెడ్డి సుధీర్ రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడు దువ్వూరు లోకేష్ రెడ్డి ఆదివారం ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జి మేరిగ మురళీధర్‌ను కలిశారు. శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. పార్టీ పదవులు వచ్చేందుకు సహకరించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, చిట్టమూరు మండల పార్టీ అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన కోట జెడ్పీటీసీ దాసరి కోటయ్య మేరిగ మురళీధర్‌ను కలిశారు. ఆయన వెంట పార్టీ నాయకులు పుట్టా నారాయణ, నాగార్జున్ తదితరులు ఉన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గం వలంటీర్ వింగ్ అధ్యక్షుడిగా నియమితులైన వాకాడు మండలం సాయిబులపాళెంకు చెందిన ఖాజా రహంతుల్లా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.



మేరిగను కలిసిన ఖాజారహంతుల్లా

అంతర్ జిల్లా హాకీలో తిరుపతి జట్టు విజయం



హాకీ టోర్నమెంట్ విజేతగా నిలిచిన తిరుపతి జిల్లా జట్టు

చిల్లకూరు : గుంటూరులో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హాకీ సీనియర్ అంతర్ జిల్లాల హాకీ టోర్నమెంట్‌లో తిరుపతి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో తిరుపతి, అనంతపురం జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా మైదానంలో రెండు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో తిరుపతి జట్టు అనంతపురం జట్టుపై 6–2 తేడాతో విజయం సాధించి విజేతగా నిలిచింది. అనంతపురం జట్టు రన్నర్‌గా నిలిచింది. తిరుపతి జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు స్వర్ణసరాజ్ మాట్లాడుతూ సీనియర్ హాకీ క్రీడా కారులను ప్రోత్సహించడంలో ముందుటామని తెలిపారు. అనంతరం బహుమతిని అందుకున్నారు. కార్యక్రమంలో హాకీ కోచ్ దీపక్ ఆకాష్, కోశాధికారి అబ్రహాం, సీనియర్ క్రీడాకారుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని భూపయ్య కాలనీ మహిళలకు ఆదివారం సాయంత్రం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. ఐద్వా మండల అధ్యక్షురాలు చంద్రకళ బహుమతులు అందజేశారు. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం మణెమ్మ, రజక సంఘం నాయకులు పట్టుయ్య, వెంకటేశ్వర్లు, మాధవి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం



కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పెళ్లకూరు: నాయకులు, కార్యకర్తలను సమైక్యపరిచి వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. రెండోసారి పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా ఆయనను ఆదివారం రాత్రి చిల్లకూరులో నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం, వినోద్‌కుమార్ రెడ్డి, జితేంద్ర, కృష్ణయ్య, కుమారస్వామి, తిరుపతయ్య, గురవయ్య, బాలాజీ, వెంకటేశ్వర్లు, చలపతి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ కుంభాభిషేకం



దేవతా మూర్తులకు భక్తుల పూజలు



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : మండలంలోని తిమ్మాజి కండ్రిగలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ మహా కుంభాభిషేకాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు ఆదివారం ఉదయం దేవతా మూర్తులతో పాటు ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టించారు. అనంతరం కుంభాభిషేకం చేపట్టారు. యాగశాలలో శాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. అదేవిధంగా తిమ్మాజి కండ్రిగ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి –గోవిందమ్మ, వినాయక స్వామి, దక్షిణామూర్తి, పార్వతీదేవి, వీరభద్రుడు, నందీశ్వరుడు, ఈశ్వరమ్మ మూర్తుల విగ్రహాలను ప్రతిష్టించారు. అనంతరం కుంభాభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

పట్టువస్త్రాల సమర్పణ

సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నాయకులతో కలిసి స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్దకు వచ్చిన ఆయనకు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేణుగోపాలస్వామి ప్రతిమ అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా స్వర్ణముఖి నది ఒడ్డున జరిగిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వార్ల కుంభాభిషేక వేడుకల్లోనూ మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు కలికి మాధవరెడ్డి, ఒట్టురు కిషోర్ యాదవ్, కామిరెడ్డి రాజారెడ్డి, తిమ్మాజి కండ్రిగ సర్పంచ్ నల్లారి ప్రకాశం, తేజ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ శిఖరంపై ప్రతిష్టించే కలశంతో భక్తులు

నిరుపేద మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంఎఫ్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు

గూడూరు రూరల్/చిల్లకూరు : సేవతోనే ఆత్మ సంతృప్తి కలుగుతుందని మహమ్మద్ ఫక్రుద్దీన్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మగ్దూమ్ మొహిద్దీన్ తెలిపారు. గూడూరు పట్టణంలోని చర్చివీధిలో ఆదివారం ఎంఎఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 70 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మగ్దూమ్ మొహిద్దీన్ మాట్లాడుతూ ప్రతి ఏటా రంజాన్ మాసంలో నిరుపేదలు, నిరాశ్రయులకు దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. గత 16 సంవత్సరాలుగా ట్రస్ట్ ద్వారా చీరలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 12వ తేదీ ఉద యం షాదీ మంజిల్‌లో 786 మందికి దుస్తులు పంపిణీ చేస్తున్నా మని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అన్వర్, అబ్దుల్ రెహమాన్, కరీ ముల్లా, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.